ప్రజల దృష్టి మరల్చడానికే..



ఎన్నికలకు ముందు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఆ హామీల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి శ్వేతపత్రాలు విడుదల చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా దాడులకు పాల్పడుతోంది. తల్లికి వందనం విద్యార్థులకు కాకుండా తల్లికి మాత్రమే రూ.15వేలు అంటూ జీఓ ఇవ్వటం, రెండు రోజుల క్రితం సీపీఎస్ రద్దు చేయకుండా జీపీఎస్‌ను అమలు చేస్తూ రాజముద్రతో పత్రాలను ప్రభుత్వం విడుదల చేసి ఉద్యోగులను మోసం చేస్తోంది. ప్రతి గ్రామంలో ఉండే నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇప్పుడేమో ఆ ఊసే ఎత్తలేదు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని లేకుండా వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన పోరాటాలు చేస్తుంది.

- శెట్టిపల్లె రఘురామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, మైదుకూరు

చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



ఎన్నికల సందర్భంగా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలన్నింటినీ ప్రస్తుతం అమలు చేయాల్సిన బాధ్యత ఉంది. సూపర్ సిక్స్ పథకాలతోపాటు అనేక హామీలను ఎన్నికల సందర్భంగా ఆయన ప్రకటించారు. 2014 ఎన్నికల్లో గెలిచిన తర్వాత మేనిఫెస్టోను కనిపించకుండా చంద్రబాబు చేశారు. 2024 ఎన్నికల్లో ఆయనను నమ్మి ప్రజలు ఓట్లు వేశారు. చెప్పిన ప్రతి మాటను, ఇచ్చిన ప్రతి హామీని ఆయన నిలబెట్టుకోవాలి. యువతకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతో ఉంది.

- రాచమల్లు శివప్రసాదరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ప్రొద్దుటూరు

మాట నిలబెట్టుకోవాలి



ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి నెల రోజులు దాటినా ఎన్నికల్లో ఇచ్చిన హామీపై ఇప్పటివరకు స్పష్టమైన ప్రకటన రాలేదు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. వెంటనే ప్రభుత్వం హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకోవాలి.

- దేవసాని ఆదిత్యరెడ్డి, వైఎస్సార్‌సీపీ బద్వేలు నియోజకవర్గ యువ నాయకులు

నిరుద్యోగ భృతి ఎప్పుడు?



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని అమలు చేయాలి. ప్రతి నిరుద్యోగికి రూ.3 వేల నిరుద్యోగ భృతి చెల్లించాలి. నోటిఫికేషన్లు లేని కారణంగా నిరుద్యోగుల సంఖ్య సమాజంలో ఎక్కడ చూసినా కనిపిస్తోంది. నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు.

- దస్తగిరి, ఏఐవైఎఫ్ పట్టణాధ్యక్షుడు, ప్రొద్దుటూరు

- ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి హామీ
- అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటినా పట్టించుకోని వైనం

భృతినివ్వు.. బాబూ

సాక్షి, నెట్‌వర్క్ : ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్‌లో నిరుద్యోగులకు పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటించింది. ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చింది. ఉద్యోగాలు కల్పించేంత వరకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేల భృతి ఇస్తామని వాగ్దానం చేసింది. ఈ విషయాన్ని ఎన్నికల ప్రచారంలో ఊదర గొట్టారు. దీంతో నిరుద్యోగులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై నెల రోజులు దాటినా ఇంత వరకు ఈ పథకం అమలుకు నోచుకోలేదు. డీఎస్సీ తప్ప మిగతా ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు విడుదల చేయలేదు. దీంతో జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు. అంత వరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వెంటనే నిరుద్యోగ భృతి హామీ అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వాస్తవానికి 2014 ఎన్నికల సందర్భంగా చంద్రబాబు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటైన నాలుగేళ్ల వరకు ఆ ఊసే లేదు. చివరి సంవత్సరంలో రూ.2 వేల చొప్పున కొందరికి మాత్రమే నిరుద్యోగ భృతి చెల్లించారు. మునుపటి అనుభవాలను గుర్తు చేసుకుంటున్న నిరుద్యోగులు మళ్లీ అదే పరిస్థితి వస్తుందేమోనని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.



ఎప్పటి నుంచి అమలు చేస్తారు?



ప్రభుత్వం నిరుద్యోగ భృతిని ఎప్పటి నుంచి అమలు చేస్తుందో స్పష్టంగా ప్రకటించాలి. అప్పులు చేసి కోచింగ్ సెంటర్లలో చదువుకుంటున్నారు. నిరుద్యోగ భృతి ఇస్తే నిరుద్యోగులకు ఊరట కలుగుతుంది. హామీని అమలు చేయని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతాం. నేను ఎంఏ, బీఈడీ చదువుకున్నా.

- ఎన్.జగదీష్, ఆల్ ఇండియ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొద్దుటూరు

నోటిఫికేషన్లు విడుదల చేయాలి



ఉద్యోగాలు లేక కుప్పలు తెప్పలుగా నిరుద్యోగుల సంఖ్య పెరిగింది. ఉద్యోగాల కోసం వేలకు వేలు ఖర్చు పెట్టి కోచింగ్‌లు తీసుకుంటున్నారు. కనీసం నిరుద్యోగ భృతి ద్వారానైనా యువతీ యువకులకు మేలు జరుగుతుంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఈ పథకాన్ని అమలు చేసి ఉంటే నిరుద్యోగులు చంద్రబాబును చిరకాలం గుర్తు పెట్టుకునేవారు.

- కె.నాగరాజు, ప్రొద్దుటూరు

ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నా



రెండేళ్ల క్రితం ఎంబీఏ పూర్తి చేశాను. కోచింగ్ కూడా తీసుకున్నాను. ఇందుకోసం రూ. లక్షల్లో డబ్బులు కూడా ఖర్చు అయింది. ప్రస్తుతం ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నాను. కూటమి ప్రభుత్వం చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. ప్రభుత్వం విడుదల చేసే ఉద్యోగ నోటిఫికేషన్, జాబ్ క్యాలెండర్‌పై ఆశలు పెట్టుకున్నాను. లేని పక్షంలో మాకు నిరుద్యోగ భృతి కింద రూ. 3 వేలు ఇవ్వాలి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబునాయుడు నిలబెట్టుకోవాలి.

- కె నవీన్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసనగర్, ప్రొద్దుటూరు

ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నా



నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. గతంలో మాదిరి కాకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి ఇవ్వాలి. నేను బి.కాం కంప్యూటర్ సైన్స్ చేశాను. ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నాను. గతంలో కూడా చంద్రబాబు రూ.2 వేలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదు. ఇప్పుడైనా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతిపై స్పష్టత ఇచ్చి నిరుద్యోగులందరికి భృతి కల్పించాలి.

- పి.రామసుబ్బారెడ్డి, బి.కాం కంప్యూటర్స్, నిరుద్యోగి, కొట్టాలపల్లె, కాశినాయన మండలం

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



డిప్లొమో చదవాను. ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నాను. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతిని అమలు చేయాలి. ప్రభుత్వం నిరుద్యోగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

- ఎస్.హుస్సేన్, చింతుకుంట గ్రామం, దువ్వూరు

నిరుద్యోగ భృతిపై స్పష్టత ఏదీ?



నేను బీకాం కంప్యూటర్స్ పూర్తి చేసి నాలుగేళ్లు అయింది. ఇంత వరకు ఎలాంటి ఉద్యోగం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగభృతి రూ.3వేలు ఇస్తామని అన్నారే కానీ, ఎవరికి, ఏ వయస్సు వరకు ఇస్తారనే విషయాలపై యువత ఆందోళన చెందుతోంది. జాబ్ క్యాలెండర్, నిరుద్యోగభృతి అమలుపై ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలి.

- పాలూరు వెంకట కుమార్, కృష్ణంపల్లె, దువ్వూరు

ఈ సారైనా ఇవ్వాలి



ఎన్నికల హామీల్లో చంద్రబాబు నిరుద్యోగ భృతిపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. నేను 2017, 2019లో రెండు సార్లు డీఎస్సీ పరీక్ష రాశాను. అలాగే ఎస్ఐ, కానిస్టేబుల్ పరీక్షలు రాశాను. అయినా నాకు ఉద్యోగం రాలేదు. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు నాకు నిరుద్యోగ భృతి ప్రతి నెల రూ.3 వేలు ఇవ్వాలి. ఈసారైనా నిరుద్యోగ భృతి ఇచ్చి హామీని నిలబెట్టుకోవాలి.

- కొండెపోగుబాలరాజు, ముద్దంవారిపల్లె, కలసపాడు మండలం

నిరుద్యోగ భృతిపై స్పష్టత లేదు



2014 ఎన్నికల ముందు నిరుద్యోగులకు రూ.2 వేలు ఇస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు మాట నిలబెట్టుకోలేక నిరుద్యోగులను మోసం చేశారు. ప్రస్తుతం అదే కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారు. అయినా ఇప్పటి వరకు నిరుద్యోగులకు భృతి ఇచ్చే విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వలేదు. అలాగే జాబ్ క్యాలెండర్ ద్వారా ఎప్పటికప్పుడు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీపై కూడా స్పష్టత ఇవ్వలేదు.

- బి.శివప్రియ, రాచాయపేట, గోపవరం మండలం

ప్రొద్దుటూరు నియోజకవర్గం	
మండలం	నిరుద్యోగుల సంఖ్య
ప్రొద్దుటూరు మున్సిపాలిటీ	1,63,970
ప్రొద్దుటూరు మండలం	94,909
రాజుపాళెం మండలం	32,829
మొత్తం	70,853
బద్వేలు నియోజకవర్గం	
బద్వేలు మున్సిపాలిటీ	2574
బద్వేలు రూరల్	835
అట్లూరు	550
కలసపాడు	654
కాశినాయన	360
బి.కోడూరు	582
గోపవరం	250
పోరుమామిళ్ల	4500
మొత్తం	1035
మైదుకూరు నియోజకవర్గం	
మైదుకూరు	22,550
చాపాడు	12,971
దువ్వూరు	16,300
ఖాజీపేట	12,750
బ్రహ్మంగారిమఠం	12,230
మొత్తం	76801

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



నేను బీటెక్ చదవాను. ఏ ఉద్యోగం లేక నిరుద్యోగిగా ఉన్నాను. గత ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగం కానీ, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం నిరుద్యోగ భృతిని నిరుద్యోగులకు చెల్లించాలి. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆదుకోవాలి.

- పి.రమేష్, టంగుటూరు గ్రామం, రాజుపాళెం మండలం

మాట నిలుపుకోవాలి



నేను 2021లో ఎలక్ట్రికల్ విభాగంలో ఐటీఐ పూర్తి చేశాను. ఉన్నత చదువులకు పోతే ఉద్యోగాలు వస్తాయో రావో అని ఐటీఐ పూర్తి చేస్తే తప్పకుండా ఉద్యోగం వస్తుందని భావించి పూర్తి చేశాను. అయితే ఇక్కడ కూడా ఉద్యోగల భర్తీ జరగడం లేదు. ప్రస్తుతం నేను చిన్న షాపుల్లో గుమస్తా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. మా కుటుంబానికి అండగా ఉంటున్నాను. ఎన్డీఏ ప్రభుత్వం వస్తే నిరుద్యోగ సమస్య తీరుతుందని భావించాను. వెంటనే ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇవ్వాలి. లేకపోతే ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి హామీ ఇచ్చినట్లుగా నిరుద్యోగ భృతి ఇచ్చి మాట నిలబెట్టుకోవాలి.

- దుగ్గిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, టీచర్స్ కాలనీ, ఖాజీపేట

మాట తప్పకూడదు



ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ఇంటికో ఉద్యోగం నిరుద్యోగులకు భృతి కింద రూ.3 వేలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ మాట ప్రకారం నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేయాలి. మాట తప్పకూడదు. నేను బీఎస్సీ, బీఈడీ చదివాను. ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాను. ఉద్యోగం కల్పించకపోయినా నిరుద్యోగ భృతి అయినా ఇవ్వాలి.

- పందీటినరసింహులు, డీవైఎఫ్ఐ కార్యదర్శి, మేకవారిపల్లె, బి.కోడూరు మండలం

భృతి కోసం ఎదురుచూస్తున్నాను



నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేసి అందజేయాలి. ప్రతి నిరుద్యోగి చంద్రబాబు మాటలు నమ్మి నిరుద్యోగ భృతి కల్పిస్తారనే ఆశతో చాలా మంది కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేశారు. వెంటనే హామీని అమలు చేయాలి.

- గుడిమెసాయి, మేకవారిపల్లె, బి.కోడూరు మండలం

అన్నప్రసాద వితరణ

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సోమవారం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దాదాపు 500 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం సభ్యులు విష్ణునారాయణ, విజయకుమార్, లింగారెడ్డి, కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

దళితుడిపై దాడి దారుణం

ప్రొద్దుటూరు : ఒంటిమిట్టలో గజ్జల వెంకట సుబ్బారెడ్డి అనే వ్యక్తి దళితుడైన ప్రభాకర్‌పై వేడి నూనె పోయడం దారుణమని రాయలసీమ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, భారతీయ కిసాన్ పార్టీ రాయలసీమ అధ్యక్షుడు రవికుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ప్రభాకర్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. దళితులపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమని పేర్కొన్నారు.

నివాళి



ఎల్లారెడ్డి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ ఆఫీస్ వెనుక నేతాజీనగర్‌లో నివాసం ఉంటున్న పోతిరెడ్డి ఎల్లారెడ్డి (93) అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సోదరుడు కిరణ్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డితోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఎల్లారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మన్ బండి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్లమాపురం వీరారెడ్డి, కాకర్ల నాగేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శారీరక మానసిక వికాసానికి క్రీడలు

మైదుకూరు : క్రీడలు శారీరక మానసిక వికాసానికి అవసరమని జంప్ రోప్ స్పోర్ట్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి అనిల్, మేధా విద్యా సంస్థల చైర్మన్ చెన్నంశెట్టి నరసింహులు అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ మైదానంలో జంప్ రోప్ జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో పాల్గొని క్రీడల్లో శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా జంప్ రోప్ ఆరు విభాగాల్లో 12, 14 ఏళ్ల బాలురు, బాలికల కేటగిరిలో ఇద్దరేసి చొప్పున మొత్తం 48 మందిని ఎంపిక చేశారు. వీరు ఈనెల 27, 28 తేదీల్లో నంద్యాలలో జరిగే 5వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ జంప్ రోప్ పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ సంఘం ప్రతినిధులు, ఉపాధ్యాయులు ముఖ్య అతిథిగా పాల్గొన్న చెన్నంశెట్టి నరసింహులును శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో హైస్కూల్ ఇన్‌చార్జి హెడ్మాస్టర్ గోశెట్టి రామమోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు నాయక్, ప్రసాద్, నాగార్జున, పుష్పలత, చంద్రావతి, వినోనియోరాణి, పాఠశాల ఉపాధ్యాయులు సూర్యనారాయణరెడ్డి, మీసాల మునెయ్య, ఎ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



జంప్ రోప్ ఎంపికల్లో పాల్గొన్న విద్యార్థులు

భూసార పరీక్షల ద్వారా ఎరువులు వాడాలి

ప్రొద్దుటూరు : రైతులు భూ సార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడటం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని డీఆర్‌సీ వ్యవసాయాధికారి శైలజ తెలిపారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో సోమవారం డివిజన్ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పొలం నుంచి మట్టి సేకరించి పరీక్షలు చేయించాలన్నారు. మట్టి పరీక్షల ఆధారంగా పంటల సాగులో ఎరువులను వాడటం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని, ఖర్చులు కూడా తగ్గుతుందని తెలిపారు. మట్టి నమూనాలు ఎలా సేకరించాలో వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శిల్పకళ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా రసాయన ఎరువులు వాడకం తగ్గించడం, భూసారాన్ని పెంచడం, నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ప్రకృతి సిద్ధంగా పండించడం వల్ల పండించిన వస్తువులకు అధిక ధర లభిస్తుందన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా పంట రకాలు వేసుకోవాలని, గ్రీన్ హౌస్ గాసెస్ తగ్గించడం వలన రైతులు నష్టపోకుండా ఉంటారన్నారు. డీఆర్‌సీ ఏఓ పద్మజ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో వాడే కషాయాల గురించి వివరించారు. ఏడీఏ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ శిక్షణలో చెప్పినవి క్షుణ్ణంగా తెలుసుకుని క్షేత్రస్థాయిలో రైతులకు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త శిల్పకళ

బీసీ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

రాజుపాళెం : మండల పరిధి టంగుటూరు గ్రామంలోని బీసీ కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి వేదిక కన్వీనర్ నాగరాజు అన్నారు. సోమవారం ఆయన రాజుపాళెంలో మాట్లాడుతూ ఆ కాలనీలో ప్రజలు, చిన్న పిల్లలు ఎన్నో అవస్థలు పడుతూ జీవనం సాగిస్తున్నారన్నారు. తాగునీటి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ గ్రామం నుంచి కొట్టాలు గ్రామానికి గ్రావెల్ రోడ్డును పునరుద్ధరించి యథావిధిగా రాకపోకలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమస్యలపై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలిపినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఈ మేరకు సోమవారం కడప కలెక్టరేట్‌లోని డీఆర్ఓను కలిసి వినతి పత్రం ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో ఆదినారాయణ పాల్గొన్నారు.



అధికారికి సమస్యలను వివరిస్తున్న నాగరాజు

పారిశుధ్య కార్మికులను మేస్త్రీలుగా నియమించాలి

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీలో పర్మినెంట్ పారిశుధ్య కార్మికులను మేస్త్రీలుగా కొనసాగించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) పట్టణ అధ్యక్షుడు బి.రామయ్య సోమవారం మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన జీఓల మేరకు పర్మినెంట్ పారిశుధ్య కార్మికులను మేస్త్రీలుగా వర్కింగ్ ఆర్గనైజింగ్ కింద ఆయా కమిషనర్లు నియమించారన్నారు. చదువుకున్న పారిశుధ్య కార్మికులను, సీనియారిటీ ప్రాతిపదికన మేస్త్రీలుగా ప్రమోట్ చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం కార్మికులు ఉండటంతో వారిపై పనిభారం పడుతోందన్నారు. రిటైర్డు అయిన రెగ్యులర్ కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను డైలీ వేజ్ కింద తీసుకొని ప్రభుత్వం అనుమతి పొందిన తర్వాత ఔట్ సోర్సింగ్‌లో వారిని తీసుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 4 మేస్త్రీ పోస్టుల్లో మూడు పోస్టులను సీనియారిటీ ప్రకారం పర్మినెంట్ కార్మికులచే భర్తీ చేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న యూనిఫాం, చెప్పులు, సబ్బులు ఇవ్వాలని పేర్కొన్నారు. డివిజన్ కార్యాలయాల వద్దే కార్మికులందరికీ మస్టర్ వేసి మానిటరింగ్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ నిర్మల, సహాయ కార్యదర్శి నాగమ్మ, సురేష్, నాగరాజు, గురుమూర్తి, డిప్యూటేషన్ మేస్త్రీలు ఓబులేసు, చైతన్య, వినోద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

జాతీయ తైక్వాండో పోటీల్లో ప్రతిభ

ప్రొద్దుటూరు : ఈ నెల 12 నుంచి 14 వరకు హైదరాబాద్‌లోని కేవీబీఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయ తైక్వాండో చాంపియన్ షిప్‌లో ప్రొద్దుటూరుకు చెందిన విన్ తైక్వాండో అకాడమి విద్యార్థులు ప్రతిభ చూపారు. విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి ఐదు బంగారు, ఒక వెండి పతకం సాధించారని కోచ్‌లు కమాల్, సంతోష్ తెలిపారు. సబ్ జూనియర్ బాలుర 21 కిలోల కేటగిరిలో నిహాల్ (బంగారు), 23 కిలోల కేటగిరిలో ఎంవీ సాయిదినేష్ (వెండి), సబ్ జూనియర్ బాలికల విభాగంలో 24 కిలోల కేటగిరిలో ఐబీ మాంషీ (బంగారు), 29 కిలోల కేటగిరిలో కె.త్రివేణి(బంగారు), కేడెట్ బాలికల 51 కిలోల కేటగిరిలో ఆర్.మహితా రెడ్డి (బంగారు), ఉమెన్స్ కేడెట్ బాలికల కేటగిరిలో ఎస్.అక్సా (బంగారు) పతకాలు సాధించారు. వీరిని ఏపీ ఎస్‌పీడీసీఎల్ బీసీ సంఘం అధ్యక్షుడు మురళీమోహన్, తల్లిదండ్రులు అభినందించారు.



జాతీయ తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

ఘనంగా మొహర్రం వేడుకలు

గోపవరం : మండలంలోని రాచాయపేటలో ఘనంగా మొహర్రం వేడుకలు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ఏడాదికి ఒకసారి ఈ మొహర్రం వేడుకలు జరుపుకోవడం విశేషం. చిన్నసరిగెత్తు సందర్భంగా సోమవారం తెల్లవారుజామున పీర్లను గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం పైటపీరును గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మంగళవారం పెద్దసరిగెత్తు సందర్భంగా రాత్రి పీర్లచావిడి వద్ద హిందూ, ముస్లింలు కలిసి పీర్లకు చదివింపులు చదివిస్తారు. అనంతరం పీర్లచావిడి ఎదుట గుండం ఏర్పాటు చేసి బుధవారం తెల్లవారుజామున గుండం తొక్కుతారు. అనంతరం పీర్లను గ్రామంలో ఊరేగిస్తారు. సాయంత్రం పీర్లను బావికి తరలించడంతో మొహర్రం వేడుకలు ముగుస్తాయి.

రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీలకు ఎంపిక

దువ్వూరు : మండలంలోని గుడిపాడు గ్రామ శంకరాచార్య హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ మూలె రామమోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మైదుకూరు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి జంప్ రోప్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 27 మంది విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆయన పేర్కొన్నారు. ఈనెల 26, 27 తేదీల్లో నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని వివరించారు.


లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని నరసింహాపురంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేసి నూతన పట్టు వస్త్రాలు, వెండి కిరీటం, వెండి నాగపడగ, ఆభరణాలు, పూలతో స్వామివారిని అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజించి కాయాకర్పూరం సమర్పించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

18న మండల సమావేశం

ప్రొద్దుటూరు : స్థానిక మండల ప్రజాపరిషత్ సభాభవనంలో ఈ నెల 18న గురువారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.కుల్లాయమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండల ప్రజా పరిషత్ సభ్యులందరూ హాజరు కావాలని ఆయన కోరారు. ఆయా శాఖల మండల అధికారులు ప్రగతి నివేదికలతో పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



డిప్యూటీ డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న ఆర్ఎస్ఓ నాయకులు

ప్రొద్దుటూరు : ఫిజికల్ ఎడ్యుకేషన్ కల్పించని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఈఓ కృష్ణప్పకు ఆర్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్, నాయకుడు లింగమయ్య సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అపార్ట్‌మెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, రేకుల షెడ్‌లు, ప్లే గ్రౌండ్ లేకుండా నడుపుతున్నారన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇరుకు గదులకు విద్యార్థులను పరిమితం చేస్తూ మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని తెలిపారు.